## నిర్లక్ష్యం నిండుగా.. మొక్కలు ఎండగా..!



గాదిగూడలో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనంలో ఎండి పోతున్న మొక్కలు

నార్నూర్, ఏప్రిల్ 13 : ప్రజలకు ఆహ్లాదం పంచే పల్లెప్రకృతి వనంలో మొక్కల సంరక్షణ కరువైంది. ఆదిలాబాద్ జిల్లా గాదిగూడలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేల మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణ బాగుండేది. గతంలో పచ్చగా మారిన పల్లె ప్రకృతి వనం నేడు ఎడారిని తలపిస్తుంది. మండల, పంచాయతీ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. వేల రూపాయలతో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాన్ని లక్షణంగా వదిలేశారు. మొక్కలు ఎండిపోతున్న కనీసం నీరు పోయని దుస్థితి నెలకొంది. ఈ పల్లెప్రకృతి వనం చూస్తేనే ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి పని తీరు ఎలా ఉందో తెలుస్తుంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పల్లెప్రకృతి వనాల సంరక్షణపై చర్యలు తీసుకోవాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన కౌఠ(బీ) గ్రామస్తులు



బోథ్ ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గ్రామస్తులు

బోథ్, ఏప్రిల్ 13: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని కౌట గ్రామంలో ఈ నెల 16వ తేదీన నిర్వహించే ఊర పోచమ్మ విగ్రహ జీర్ణోద్దారణ కార్యక్రమానికి హాజరు కావాలని ఆదివారం ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను ఆహ్వానించారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అలాగే ఈ నెల 23న గ్రామంలో జరిగే వీరయ్య విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరు కావాలని కుర్మె గోళ్ల సంఘం సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు స్వామి, వీడీసీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, సభ్యులు సురేశ్, సుభాష్ పాల్గొన్నారు.

## పాఠశాలలో సెల్ టవర్‌తో విద్యార్థుల ఇబ్బందులు

జైనథ్, ఏప్రిల్ 13: ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలంలోని గిమ్మా గ్రామానికి చెందిన మామిడిపెల్లి సతీశ్ రావ్, మామిడిపెల్లి నితిన్‌రావ్ తమ పంట పొలంలో ఉన్న సెల్ టవర్‌తో ఇబ్బంది కల్గుతుందన్న నేపథ్యంలో గిమ్మా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వకుండా మట్టిని తొలగించారు. విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో సెల్ టవర్ మట్టి పాఠశాల ఆవరణలో జేసీబీ ద్వారా విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో పాటు పాఠశాల ఆవరణలో హరితహారం కింద నాటిన మొక్కలు పూర్తిగా తొలగించారు. ఘటనకు పాల్పడ్డ మామిడిపల్లి నితిన్ రావ్, మామిడిపల్లి సతీశ్‌రావ్‌పై గిమ్మా గ్రామస్తులు ఎస్ఐ వీ పురుషోత్తమ్‌కు ఫిర్యాదు చేశారు. పాఠశాల ఆవరణకు పక్కన గల సెల్ టవర్ కారణంగా రేడియేషన్‌తో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని అన్నారు. బాధ్యులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని గిమ్మా గ్రామస్తులు కోరుతున్నారు.



గిమ్మా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జేసీబీతో తొలగిస్తున్న మొక్కలు

## ప్రారంభానికి నోచుకోని రెంకొనివాగు బ్రిడ్జి

- తాత్కాలిక రోడ్డుతో నిర్మల్, మంచిర్యాల జిల్లాల ప్రజలకు తప్పని తిప్పలు
- వానకాలంలోపు ప్రారంభించాలని కోరుతున్న వాహనదారులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రెంకొనివాగు బ్రిడ్జి

ఖానాపూర్, ఏప్రిల్ 13 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ శివారులో నిర్మిస్తున్న రెంకొనివాగు బ్రిడ్జి పనులు పూర్తయి నెలలు గడుస్తున్న ప్రారంభానికి నోచుకోవడం లేదు. దాంతో నిర్మల్, మంచిర్యాల జిల్లాల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి మీదుగా ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల జిల్లాలకు నిత్యం వేల వాహనాలు రాకపోకలు సాగుతాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023లో రాకపోకలు సుగుమం చేసేందుకు ఖానాపూర్ మండలంలోని అంబేద్కర్‌నగర్, గాంధీనగర్‌లో బ్రిడ్జిల నిర్మాణానికి రూ.9.90 కోట్ల నిధులు మంజూరు చేసి అప్పటి ఎమ్మెల్యే, మంత్రులు పనులకు శంకుస్థాపన చేశారు. కాని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కొ వంతెనకు రూ. 5.20 కోట్లు మంజూరు చేసి మళ్లీ ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. దీంతో రాకపోకలు సులభతరం అవుతాయని భావించిన ప్రజలు తాత్కాలిక రోడ్డుతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసినప్పటికీ బ్రిడ్జి మీదుగా రాకపోకలు ప్రారంభించడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుందని పలు జిల్లాల ప్రజలు, వాహనదారులు మండిపడుతున్నారు. వంతెన మీదుగా రాకపోకలు ప్రారంభం కానిచో వానకాలంలో నిర్మల్, మంచిర్యాల జిల్లాల ప్రజలు అరిగోస పడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి ఖానాపూర్-తర్లపాడు మధ్యలో నిర్మించిన రెంకొనివాగు బ్రిడ్జిని రానున్న వాన కాలం లోపు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.



తాత్కాలిక రోడ్డుతో అవస్థలు పడుతున్న వాహనాదారులు

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఎదులాపురం: 1998-99 పూర్వ విద్యార్థుల బృందం

ఎదులాపురం, ఏప్రిల్ 13 : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పొచ్చెర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు.

భైంసా, ఏప్రిల్ 13 : నిర్మల్ జిల్లా భైంసాలోని వివేకానంద హైస్కూల్ పాఠశాలలో 2008-09లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. యోగక్షేమాలడిగి తెలుసుకున్నారు. పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివాజీ, ఉపాధ్యాయులు వెంకటేశ్, గణేశ్, జనార్దన్, విద్యార్థులు పాల్గొన్నారు.



భైంసా: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

## హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటం



బైక్ ర్యాలీ తీస్తున్న సీఐటీయూ నాయకులు

ఎదులాపురం, ఏప్రిల్ 13 : కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కుల సాధన కోసం సీఐటీయూ రాజీలేని పోరాటం చేస్తుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. సామాజిక న్యాయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆదిలాబాద్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ తీశారు. సుందరయ్య భవనం నుంచి కలెక్టర్ చౌరస్తా మీదుగా ప్రధాన కూడళ్ల గుండా ర్యాలీ సాగింది. తిరిగి సుందరయ్య భవనానికి చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ కార్మికుల సామాజిక అణచిత, వివక్ష,, కులమతల రాజకీయలకు వ్యతిరేకంగా కార్మికులు ఏకం కావాలన్నారు. కార్మిక విప్లవ యోధులు, అమరుల స్ఫూర్తితో కేంద్రం తీసుకువచ్చిన నాలుగు లెబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఎనిమిది గంటల పని దినాలు సాధించడానికి పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న. అగ్గిమల్ల స్వామి, నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో పలువురికి తీవ్రగాయాలు

ఖానాపూర్ టౌన్, ఏప్రిల్ 13: నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని కుమ్రం భీం చౌరస్తాలో అదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్‌లోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన అలెపు చిన్నయ్యకు సంబందించిన కుటుంబ సభ్యుడు నిర్మల్‌లో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు అరుగురితో కలిసి ఆటోలు సాయంత్రం 7 గంటలకు ఖానాపూర్ నుంచి నిర్మల్‌కు బయలు దేరారు. కుమ్రం భీం చౌరస్తా వద్దకు రాగానే వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఖానాపూర్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న బైక్ నిర్మల్ నుంచి ఖానాపూర్ వైపు వస్తున్న కారును ఢీ కొట్టి ఆటోపై పడింది. ఆటో అదుపు తప్పి కింద పడడడంతో అందులు ప్రయాణిస్తున్న చిన్నయ్య, రమేశ్‌తో పాటు నలుగురికి, బైక్‌పై ఉన్న హన్మాండ్లు, చిన్నయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఖానాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. ఇందులో పలువురి పరిస్థితి విషమంగా ఉండడంతో నిర్మల్ జిల్లా దవాఖానకు తరలించారు.

## సైబర్ క్రైమ్, నూతన చట్టాలపై అవగాహన

ఎదులాపురం, ఏప్రిల్ 13: సైబర్ క్రైమ్, నూతన చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని రూరల్ సీఐ ఫణిధర్ అన్నారు. మావలలో ఆదివారం రాత్రి పోలీసు మీ కోసం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ ఫణిధర్ మాట్లాడుతూ ఆసాంఘిక కార్యకలాపాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ చైతన్య పరిచేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా గంజాయి, మాదకద్రవ్యాలను జిల్లాలో పూర్తిగా అణిచివేయాలని ఉద్దేశంతో ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గంజాయి స్మగ్లర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలన్నారు. గంజాయి పండించే వారిపై ప్రభుత్వం పథకాలు రాకుండా నివేదికలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో మావల ఎస్ఐ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

### పేకాట రాయుళ్లు అరెస్టు

జైనథ్, ఏప్రిల్ 13: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని సావపూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై జైనథ్ సీఐ సాయినాథ్, ఏఎస్ఐ సిరాజ్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాటాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 52 పేక ముక్కలు, రూ.16,830 నగదు సీజ్ చేశారు. పేకాట రాయుళ్లను పట్టుకున్న జైనథ్ సీఐ డీ సాయినాథ్, ఏఎస్ఐ సిరాజ్, కానిస్టేబుళ్లు రాజు, శ్రీనివాస్, రైజుద్దీన్‌ను డీఎస్పీ జీవన్ రెడ్డి అభినందించారు.

### హార్టికల్చర్ నర్సరీలో అగ్నిప్రమాదం

ఎదులాపురం, ఏప్రిల్ 13 : ఆదిలాబాద్‌లోని దివ్యాంగుల కాలనీ సమీపంలోని హార్టికల్చర్‌లోని నర్సరీలో ఆదివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. నర్సరీలోని మామిడి వనంలో చెత్తాచెదారానికి నిప్పు అంటుకోవడంతో మంటలు విస్తరించాయి. దీంతో స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి ఫైర్ ఇంజిన్ సాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో సమీప కాలనీవాసులకు ముప్పుతప్పింది. ఎండకాలంలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారులు సూచించారు.

### సరస్వతీ కాలువలో మృతదేహం లభ్యం

లక్ష్మణచాంద, ఏప్రిల్ 13 : సరస్వతీ కాలువలో ఆదివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ మాలిక్ రహమాన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని వడ్యాల్ గ్రామ సమీపంలోని సరస్వతీ కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. మృతుని వయస్సు సుమారు 30-35 సంవత్సరాల వరకు ఉంటుంది. ఎత్తు 5 ఫీట్లు, ఆరెంజ్ కలర్ టీషర్టు, బ్లూజీన్స్ ధరించి ఉన్నాడు. మృతుని సమాచారం కోసం ఎస్ఐ లక్ష్మణచాంద 8712659521, సీఐ 871265919 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### వాహన తనిఖీలు

ఖానాపూర్ టౌన్, ఏప్రిల్ 13: నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని అంబేద్కర్‌నగర్ శివారు ప్రాంతంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారిపై పోలీసులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ పత్రాలు, ఇన్సూరెన్స్ పత్రాలు పరిశీలించడంతో పాటు నంబర్‌ప్లేట్ లేని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వీటితో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించి వాహనదారులకు పలు సూచనలు చేశారు. ఇక్కడ ఏఎస్ఐ సైపొద్దీన్, సిబ్బంది నర్సయ్య, రవీందర్ ఉన్నారు.

### ప్రభుత్వ నిర్ణయం ఉపసంహరించుకోవాలి

ఎదులాపురం, ఏప్రిల్ 13: విద్యార్థులను చేర్పిస్తే ఉపాధ్యాయులకు పాయింట్లు ఇస్తాననే ప్రభుత్వ నిర్ణయం వెంటనే ఉపసంహరించుకోవాలనీ డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం సోమయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని డైట్ కళాశాలలో నిర్వహించిన డీటీఎఫ్ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలకు వేసవిలో విద్యార్థులను సేకరించి, చేర్పిస్తే ఉపాధ్యాయులకు పాయింట్లు ఇస్తామని, సర్వీస్ పుస్తకంలో నమోదు చేస్తామని, బదిలీల్లో, ఉద్యోగోన్నతుల్లో ప్రాధ్యానమిస్తామని ప్రభుత్వం నిర్ణయం చేయబోతుందని, ఈ నిర్ణయాన్ని ఉపసంవారించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీ శ్యామ్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి వృకోధర్, కమిటీ సభ్యులు ఉదారి నారాయణ, నాగేందర్, బానోత్ ప్రకాశ్, ఎస్ సుధాకర్, దిలీప్, ప్రేమ్‌సింగ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పూర్వ అధ్యక్షుడు కొండయ్య, వివిధ మండలాల బాధ్యులు వీరయ్య, అరవింద్, కృష్ణ, సాయికాంత్, శుద్ధోధన్, భీంరావ్, సంతోష్, ప్రహ్లద్, మహేందర్ పాల్గొన్నారు.

### పాలిటెక్నిక్ అల్యూమ్ని అసోసియేషన్ కమిటీ ఎన్నిక

ఎదులాపురం, ఏప్రిల్ 13: ఆదిలాబాద్ సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చరిత్రలో మొదటిసారిగా నిర్వహించిన మొదటి అల్యూమ్ని మీట్ విజయవంతమైనట్లు ప్రిన్సిపాల్ బండి రాంబాబు పేర్కొన్నారు. శనివారం కళాశాలలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాల అల్యూమ్ని అసోసియేషన్ కమిటీని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా పురాణం సతీశ్, ఉపాధ్యక్షుడిగా పీ వసంత్ రావ్, ప్రధాన కార్యదర్శిగా అభయ్ రాజ్, కార్యదర్శిగా గట్టయ్య, సంయుక్త కార్యదర్శిగా రమేశ్ రావ్, కోశాధికారిగా సరోజ, ఉమశంకర్, సలహాదారులుగా రఘునందన్, వీవీఎన్ ఎస్ రామ్, వెంగపేట్ రమేశ్, కమిటీ సభ్యులుగా కట్ట శ్రీనివాస్, దేవీదాస్, చరిస్ దశరథ్, సతీశ్ రెడ్డి, విక్రమ్, హరీశ్, బాబు, రంజిత్, మాజీ కార్యాలయ మెంబర్‌గా కళాశాల ప్రిన్సిపాల్, సల్ల విజయ బాబును ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ అల్యూమ్ని కమిటీ ఆధ్వర్యంలోనే ఇక నుంచి అల్యూమ్ని కార్యక్రమాలు, వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

### వశిష్ట డిగ్రీ కళాశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 13: నిర్మల్‌లో ఆదివారం వశిష్ట డిగ్రీ కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాన్ని ఎంచుకుని ప్రణాళిక ప్రకారంగా ముందుకెళ్లాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అఖిలేశ్ కుమార్ సింగ్, వైస్ ప్రిన్సిపాల్ శశిధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నామమాత్రంగా నర్సరీల పెంపకం

- వనమహోత్సవానికి ఆరంభంలోనే అడ్డుకట్ట



గోసంపల్లెలో మొక్కలు లేని నర్సరీ

ఖానాపూర్ రూరల్, ఏప్రిల్ 13: రాష్ట్రంలో పచ్చదనం పెంచాలనే లక్ష్యంతో వనమహోత్సవం లాంటి కార్యక్రమలు ప్రభుత్వం చేపట్టింది. కానీ దీని కోసం నర్సరీలో మొక్కల పెంపకాలు మాత్రం ఆరంభం దశలోనే నీరుగారుస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి పల్లె నర్సరీలో 13 వేలకు తగ్గకుండా మొక్కలు పెంచాలి. కానీ ఖానాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో నర్సరీలో మొక్కల పెంపకాల నిర్వహణ మాత్రం నామమాత్రంగా కనిపిస్తుంది. అధికారులు నర్సరీల పెంపకాలను సక్రమంగా చూసుకోకపోవడంతో 50 శాతం మొక్కలు ప్రారంభదశలోనే నశిస్తున్నాయి. ఖానాపూర్ మండలంలోని గొడలపంపు, గోసంపల్లెతో పాటు తదితర గ్రామాల్లో నర్సరీలో మొక్కల పెంపకాలు వనమహోత్సవానికి అడ్డుకట్ట వేసున్నట్లు కనిపిస్తున్నాయి. జూన్ మాసం నాటికి వనమహోత్సవం అందించే మొక్కలు ఇప్పటికి నర్సరీలో లేవు. నవంబర్, డిసెంబర్ మాసాలలో నర్సరీల్లో మొక్కలను నాటడం ప్రారంభించిన ఇప్పటికీ మొలకెత్తలేదు. సగానికి పైగా మొక్కలు లేని ఖాళీ మట్టి సంచులు కనిపిస్తున్నాయి. దానిమ్మ. నేరేడు, ఈత, ఖర్జురం, బాదం, నిమ్మ, జామ,మర్రి, అల్లనేరేడు లాంటి మొక్కలు నాటాల్సి ఉండగా కొన్ని చోట్ల చింత చెట్టు మొక్కలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. నిరంతరం నర్సరీల్లో సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తున్న చర్యలు మాత్రం తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు వనమహోత్సవానికి మొక్కలు అందేటట్లు చర్యలు తీసుకొని పల్లెలు పచ్చదనం పెంచాలని కోరుతున్నారు.



గొడలపంపులో నర్సరీలో సగానికి పైగా లేని మొక్కలు

## అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 13: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో ఈ నెల 20వ తేదీన నిర్వహించే అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పిలుపునిచ్చారు. ఆదివారం ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్తూపాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, ఎస్పీ అఖిల్ మహాజన్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్‌తో కలిసి పరిశీలించారు. అమరవీరుల స్తూపం వద్ద జరుగుతున్న స్మృతి వనం ఏర్పాట్ల పనులతో పాటు చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. స్మృతి వనం ప్రారంభోత్సవానికి వస్తున్న మంత్రి సీతక్క పర్యటన, విశ్రాంతి తీసుకునే అంశాలతో పాటు వివిధ అంశాలపై చర్చించారు. రగల్ జెండాకు సంబంధించిన పాత కమిటీనే యథావిధిగా కొనసాగించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్‌కు రగల్ జెండా కమిటీ చైర్మన్ తొడసం నాగోరావ్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సార్‌మేడిలు, గ్రామపటేళ్లు, రగల్ జెండా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**అమరవీరుల సంస్మరణ దినోత్సవంపై ఎలాంటి అంక్షలు ఉండవు : ఎస్పీ అఖిల్ మహాజన్**

ఈ నెల 20న నిర్వహించే అమరవీరుల సంస్మరణ దినోత్సవంపై పోలీసుల తరపున ఎలాంటి అంక్షలు ఉండవని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. కలెక్టర్‌తో పాటు ఐటీడీఏ పీవోతో అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఏర్పాట్లతో పాటు తరలివచ్చే ఆదివాసీ గిరిజనులకు కల్పించే సౌకర్యాలపై చర్చించడం జరుగుతుందన్నారు. ఆదివాసులు శాంతియుత వాతావరణంలో అమరవీరుకుల నివాళులర్పించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

### పరామర్శ



వివరాలు తెలుసుకుంటున్న జాన్సన్ నాయక్

ఉట్నూర్, ఏప్రిల్ 13: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు చెందిన ఉబెద్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్, సలీం, విజయ్ ఉన్నారు.

### వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలి

ఎదులాపురం, ఏప్రిల్ 13 : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట సీపీఐ నాయకులు ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుంటాల రాములు, అమీనా, తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ అభివృద్ధికి కృషి

ఉట్నూర్ రూరల్, ఏప్రిల్ 13 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని కల్లూర్‌గూడ గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి ఆదివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ గ్రామస్తులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం

బోథ్, ఏప్రిల్ 13: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని సాకెర గ్రామానికి చెందిన కుందూరు రాకేశ్ ఇటీవల మృతి చెందాడు. ఆదివారం సొనాలకు చెందిన యువ శక్తి యూత్ సభ్యులు వారి ఇంటికి వెళ్లి రూ.13 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఇక్కడ యువశక్తి యూత్ అధ్యక్షుడు తుల హరీశ్, ఉపాధ్యక్షులు గాజుల సుగుణాకర్, దాసరి లక్ష్మణ్, కదం చక్రపాణి, దండారి రంజిత్, సింగం నందికేశ్వర్ ఉన్నారు.

### ఐక్యతతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు హన్మాండ్లు యాదవ్

భీంపూర్, ఏప్రిల్ 13 : వెనుకబడిన యాదవ సహా ఇతర సామాజిక వర్గాల సమగ్రాభివృద్ధి ఐక్యత, విద్యతోనే సాధ్యమవుతుందని యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు అసుర హన్మాండ్లు యాదవ్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని కరంజి(టీ), గోముత్రి గ్రామాలను ఆదివారం ఆయన సంఘ ప్రతినిధులతో కలిసి సందర్శించారు. అక్కడ కమిటీల సభ్యులతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల అవశ్యకత గురించి వివరించారు. ఆయన వెంట సంఘ ప్రతినిధులు భీమన్న, దేవారెడ్డి, మంచాల మల్లయ్య. నారాయణ, కృష్ణమీనన్, మేకల బాపు , నరేందర్, కల్పాప్‌యాదవ్, విఠల్, రమేశ్ ఉన్నారు.

### క్రైస్తవుల శాంతి ర్యాలీ

ఉట్నూర్, ఏప్రిల్ 13: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో ఆదివారం యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్, డివిజన్ యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాలకు శాంతి చేకూరాలని ర్యాలీ తీశామని తెలిపారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ డానియల్, జోసెఫ్, రాజరత్నం, బ్రదర్ మిక్కాయల్ పాల్గొన్నారు.

### కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ముథోల్, ఏప్రిల్ 13 : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. ఆదివారం నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని వడ్తాల్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, తహసీల్దార్ శ్రీకాంత్, మాజీ జడ్పీటీసీ లక్ష్మీనర్సాగౌడ్, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

### వడూర్ దాబా యజమానిపై కేసు

తాంసి(భీంపూర్), ఏప్రిల్ 13 : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం వడూర్ గ్రామ సమీపంలోని వచ్చితినిపో దాబాలో అనుమతి లేని మద్యం నిల్వ, సిట్టింగ్‌కు పోలీసులు ఆదివారం రాత్రి తనిఖీ చేశారు. 16 బీరు సీసాలు స్వాధీనం చేసుకుని యజమాని దండే వెంకటస్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ముంతాజ్ తెలిపారు.

### ఉద్యమకారుల త్యాగం అనిర్వచనీయం

భైంసా, ఏప్రిల్ 13 : ఉద్యమకారుల త్యాగం అనిర్వచనీయమని పట్టణ సీఐ గోపీనాథ్ అన్నారు. ఆదివారం నిర్మల్ జిల్లా భైంసా పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్యమకారుల ముథోల్ నియోజకవర్గం పుస్తక పరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ధన, ప్రాణాలను తృణ ప్రాయంగా భావించి, రాష్ట్ర ఆవిర్భామే లక్ష్యంగా పని చేసిన ఉద్యమకారుల త్యాగాలు భావితరాలకు తెలియజేసి, భవిష్యత్ తరాల వారికి స్ఫూర్తినిచ్చేందుకు ఈ పుస్తకం ఉపకరిస్తుందని అన్నారు. ఇక్కడ ఉద్యమకారుల ఫోరం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ముష్కం రామకృష్ణ గౌడ్, ప్రముఖ కవి, రచయిత సంపాదకుడు జాదవ్ పుండలిక్ రావు పాటిల్, కవి బసవరాజు ఉన్నారు.

### మానవత్వం చాటుకున్న మాజీ జడ్పీటీసీ

భైంసా, ఏప్రిల్ 13 : నిర్మల్ జిల్లా భైంసాలో ఓ పిచ్చోడు కొద్ది రోజులుగా దుస్తులు లేక వీధుల్లో తిరుగుతుండగా గమనించిన మాజీ జడ్పీటీసీ సూర్యం రెడ్డి నూతన వస్త్రాలను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నాడు. ఆయన వెంట నాయకులు చొండి రాజేశ్వర్, నాగేందర్ పటేల్ ఉన్నారు.

### ఉచిత కంటి వైద్య శిబిరం

దస్తురాబాద్, ఏప్రిల్ 13 : నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని రేవోజిపేట గ్రామంలో ఆదివారం దేవి ఐ కేర్ ఖానాపూర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్య నిపుణుడు బోగ సాయి నిఖిల్ కంటి సమస్యతో బాధపడుతున్న వారికి కంటి పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.